PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA
DK MEDIA
OUR SERVICES
* NEWS PAPER * DK ADS & PROMOTIONS
* NEWS CHANNEL * DK PRINTERS
* DK GRAPHICS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 01 సంచిక : 337 మంగళవారం, జూన్ 30 2026, పేజీలు - 5 వెల : 5 రూ/-

### నేడు రైతుభరోసా నిధుల విడుదల
### తొలివిడతలో 41.37 లక్షల మంది

# అన్నదాతలకు లబ్ధి

- రైతుభరోసా నిధుల విడుదల చేస్తామన్న మంత్రి తుమ్మల
- నేడు 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- మిగతావారికి దశలవారీగా విడుదల చేస్తామన్న మంత్రి



**హైదరాబాద్ :** రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. రేపటి నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయంగా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అందరికీ నిధులు జమచేస్తామన్నారు.రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో 'రైతు ఆశీర్వద సభ'ను నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. తొలి విడత నిధులు జమచేయాలని ప్లాన్ చేసింది. అయితే ఖమ్మంలో (ఆదివారం) కురిసిన భారీ వర్షానికి ఇవాళ ఏర్పాటుచేయాలని భావించిన రైతు మేళా, రేపటి (మంగళవారం) కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్ద ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను ప్రభుత్వం రద్దు చేసింది.రైతు భరోసా పంపిణీ సదస్సు : రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం రేవంత్?రెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.కొత్తవారికి కూడా పెట్టుబడి సాయం : అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రేపు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతా వారికి దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5 లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు.మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తాం : వర్షాల వల్లనే రైతు ఆశీర్వాద సభ వేదికను మార్చినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈనెల 4 వరకు వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ చెప్పిందన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తామని భట్టి చెప్పారు. రైతుభరోసా ముగింపు వేడుకగా సభ నిర్వహించే ఆలోచన చేస్తున్నామన్నారు. అనుకూల వాతావరణం చూసి మధిర సభ తేదీని మళ్లీ ప్రకటిస్తామని భట్టి వెల్లడించారు.

### పార్టీలు, నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు

# గుర్తుంచుకుంటారు



**హైదరాబాద్ :**తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని సంపూర్ణ విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని యువత రాజకీయాల్లోకి రావాలన్న ఆయన వచ్చాక ఏం చేస్తారో ఓ స్పష్టత ఉండాలని సూచించారు. గతంలో మానవ హక్కుల గురించి ప్రజలకు అంతగా తెలిసేది కాదన్న నితిన్ సోషల్ మీడియా వచ్చాక ప్రజల్లో చైతన్యం పెరిగిందన్నారు. హక్కులు, విధుల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంక్లేవ్‌లో నల్సార్, ఐఎస్‌బీ, హెచ్‌సీయూ, కేయూ, ఓయూ, ఐఐటీ, ఐఐఐటీ, ఎన్‌ఐటీ, ఇఫ్లూ, బిట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.
12 ఏళ్ల మోదీ పాలనపై చర్చ : ఈ కాంక్లేవ్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్, తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు, ఎంపీ డీకే అరుణ, అభయ్ పాటిల్, ఆశిష్ సెల్లార్, రేఖా శర్మ, చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. భారత్-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు నితిన్ నబీన్ ఇచ్చారు. 2047-వికసిత్ భారత్ లక్ష్యం, 12 ఏళ్ల మోదీ పాలనపై చర్చ జరిగింది. అంతకుముందు కళా ఆవరణలో నితిన్ నబీన్ మొక్కను నాటారు.


### రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు

# 2047 సాధ్యం



**న్యూఢిల్లీ, జూన్ 29:** వీబీ జీ రామ్‌పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. (సోమవారం) ఢిల్లీలో జాతీ య గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజ రయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీ య సదస్సులో కేంద్రానికి వివరించా రు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబి నెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలి పారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసా గించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణ కు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఎదీ + =ూవీ +పై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు--2047' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు.ఎంజీఎన్ఆర్ ఈజీఎస్‌లో పాత 100 శాతం వేతనాల విధానమే కొనసాగించాలని సీతక్క కోరారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త విధానం వల్ల రాష్ట్రాలపై భారీగా ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులే ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని వివరించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో కూడా జాప్యం జరుగుతోందన్నారు.

### తెలంగాణ లో ఐపీఎస్ అధికారుల బదిలీలు




**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్‌పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝూకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సున్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు.

### ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన

# రాజ్యసభ ఛైర్మన్



**న్యూ ఢిల్లీ :**రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్‌రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు.
అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్?లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు."రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. నిలిచిన లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు, ముఖ్యంగా ఇండియా బ్లాక్‌లోని సహచరులకు, ఇతర ప్రతిపక్షాల సహకారానికి నేను కృతజ్ఞుడను."

### ఇంటింటికీ ఆరు సార్లు వెళ్లాలి.. వరంగల్ మేయర్ సీటు

# మోదీకి గిఫ్ట్.



**వరంగల్ :**కేంద్రమంత్రి బండి సంజయ్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను టార్గెట్ చేస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిం చారు. వరంగల్‌లో నిర్వహించిన బీజేపీ పోలిం గ్ బూత్ అధ్యక్షుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధ్యాయం ముగిసిందని, కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతోందని.. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్ని కలు వచ్చినా గెలిచేది బీజేపీయేనని ధీమా వ్యక్తం చేశారు.వరంగల్ అభివృద్ధికి మోదీ నిధులు.. స్థానిక పాలకుల నిర్లక్ష్యంవరంగల్ నగర అభివృద్ధిని గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా గాలికొదిలేశాయని బండి సంజయ్ మండిపడ్డారు.రూ.12 లక్షల కోట్ల కేంద్ర నిధులు: గత 12 ఏళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వికాసానికి ఏకంగా రూ.12 లక్షల కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరానికే కేంద్రం అత్యధిక నిధులు ఇచ్చిందన్నారు.స్మార్ట్ సిటీ నిధుల దుర్వినియోగం: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 'స్మార్ట్ ' నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. కేంద్రం ఇన్ని కోట్లు ఇచ్చినా, నగరంలో కనీసం చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లన్నీ జలమయం కావడం ఇక్కడి పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఓరుగల్లుకు నయా పైసా మేలు జరగలేదని విమర్శించారు.

### వర్షం ఎఫెక్ట్ మధిర రైతు ఆశీర్వాద

# సభ రద్దు



**హైదరాబాద్, జూన్ 29:** ఖమ్మం జిల్లా మధిరలో (మంగళవారం) జరగా ల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దైంది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. రేపు సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు.మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో రేపు రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు.అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది.

### డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని

# మా అనుమానం



**హైదరాబాద్, జూన్ 29 :** దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. (సోమవారం) హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయి.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొడంగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని వచ్చాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు.రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను పరిశీలించాలి..ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక



# సింగరేణి అధికారుల డిమాండ్లను పరిష్కరించాలి

- సంస్థను కాపాడుతున్న అధికారుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- అధికారుల నిరసన దీక్ష శిబిరాన్ని సంద ర్శించి సంఘీభావం ప్రకటించిన కూనంనేని



**భద్రాద్రికొత్తగూడెంబ్యూరో(విశాల జ్యోతి):** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారి పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం(ఐఎంఓఏ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం అధికారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. అధికారుల పే-రివిజన్ అలవెన్సులు పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వాటా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవ చూపాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జె.గట్టయ్య, కిష్టాఫర్ తదితరులుపాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి గణాంకాలే బలమైన పునాది

- బాలకిష్టా రెడ్డి, చైర్మన్ ఉన్నత విద్యా మండలి
- కేయూలో ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం.
- వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ.



**కేయూ క్యాంపస్, విశాలజ్యోతి:** భారతీయ గణాంక శాస్త్ర పితామహుడు, ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ ప్రసాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం మరియు డీన్, స్టూడెంట్ అఫైర్స్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో 20వ జాతీయ గణాంక దినోత్సవం--2026ను "అన్లాకింగ్ ద పోటెన్షియల్ ఆఫ్ అడ్మిని స్ట్రేటివ్ డాటా" అనే అంశంపై సోమవారం విశ్వవిద్యాలయ స్టాటిస్టిక్స్ విభాగ సెమినార్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి స్టాటస్టిక్స్ విభాగాధిపతి డా. జె. శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, డా. బి. నిరం జన్ శ్రీనివాస్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, కార్య క్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.డేటా ఆధారిత నిర్ణయాలే అభివృద్ధి మార్గంముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, "దేశాభివృద్ధికి గణాంకాలు కేవలం సంఖ్యల సమాహారం మాత్రమే కాకుండా, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు, పారదర్శక పాలనకు, సమర్థవంతమైన నిర్ణయాలకు మూలాధారంగా నిలుస్తాయి. పరిపాలనా డేటాను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, ఆర్థికాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో నాణ్యమైన విధానాలను రూపొందించవచ్చని తెలిపారు. డిజిటల్ యుగంలో డేటా సేకరణ, విశ్లేషణ, కృత్రిమ మేధస్సు, బిగ్ డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాలతో గణాంక శాస్త్రానికి మరింత ప్రాధాన్యం పెరిగిందన్నారు. యువత డేటా సైన్స్, స్టాటిస్టిక్స్, అనలిటిక్స్ వంటి రంగాలలో నైపుణ్యాలు పెంపొందించుకొని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహలనోబిస్ అందించిన శాస్త్రీయ దృక్పథం నేటికీ దేశ ప్రణాళికా వ్యవస్థకు మార్గదర్శకంగా నిలుస్తోందని, పరిపాలనా డేటా సామర్థ్యాన్ని వెలికితీయడం ద్వారానే సమగ్ర, సమాన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.విశిష్ట అతిథులుగా పాల్గొన్న కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, వైస్ ఛాన్సలర్ ఓఎస్డీ ప్రొఫెసర్ బి. వెంకట్రాం రెడ్డి, మాజీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ, గణాంక శాస్త్రం ప్రతి విద్యార్థికి అవసరమైన ప్రాథమిక విజ్ఞానంగా మారిందన్నారు. పరిశోధనలు, ప్రభుత్వ విధానాలు, పారిశ్రామిక అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో గణాంకాల పాత్ర అపారమని తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు పరిశోధన దృక్పథాన్ని పెంపొందించుకొని డేటా ఆధారిత ఆలోచనతో సమాజానికి సేవ చేయాలని సూచించారు. గణాంకాల ఆధారంగా తీసుకునే నిర్ణయాలు దేశ అభివృద్ధికి దోహదపడతాయని, ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేక ఆహ్వానిత వక్తగా పాల్గొన్న విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ "అనాలకింగ్ ద పోటెన్షియల్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ డాటా" అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తూ, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న పరిపాలనా డేటాను సమర్థవంతంగా విశ్లేషించడం ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణమైన విధానా లను రూపొందించవచ్చని వివరించారు. నాణ్యమైన డేటా ఆధారంగా పాలన మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుం దని, డేటా గోప్యత, విశ్వసనీయత, శాస్త్రీయ విశ్లేషణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భవిష్యత్‌లో డేటా ఆధారిత పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయ ని విద్యార్థులకు అవగాహన కల్పించారు.వ్యాస రచన పోటీల్లో విజేతలు వీరే...ఈ సంద ర్భం గా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బీ. అంజలి ప్రథమ బహుమతి, ఎం. వైష్ణవి ద్వితీయ బహుమతి, జె. వేణు తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలకు అతిథులు ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లు మరియు పుస్తకాలను బహుమతులుగా అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ ఇస్తారి మామిడాల, స్టాటస్టిక్స్ విభాగ అధ్యాపకులు బి. హరికృష్ణ, జి. కళ్యాణి, కె. గాయత్రి, జె. అనూష, సతీష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. మమత, ఆంగ్ల విభాగ అధ్యాపకులు డా. దీపా జ్యోతి, డా. మేఘన, డా. నిర్మల, గణితశాస్త్ర విభాగ అధ్యా పకులు డా. భారవి శర్మ, డా. సోమయ్య, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ డా. రాధికతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):** ప్రజలకు సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో నిబద్ధతతో సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందుతున్న కె.సంజీవరావు (సీపీఓ), డాక్టర్ వెంకటేశ్వ ర్లు(డీవీఏహెచ్ఓ), చి.రమేష్‌బాబు (అసిస్టెంట్ ఇంజనీర్ హౌసింగ్), అంజనేయులు(ఆఫీస్ సబారినేట్ హౌసింగ్ శాఖ)లకు ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాటి నుంచి ఉద్యోగికి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని విధి నిర్వహణలో సంపాదించిన అనుభవం ప్రజల ఆదరణ జీవితాంతం వెంట ఉంటాయని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. పదవీ విరమణతో ఉద్యోగ జీవితం ముగిసినప్పటికీ సమాజానికి సేవ చేసే అవకాశాలు ఎన్నో ఉంటాయని పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవాలను విలువైన సూచనలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవడం ద్వారా వారికి మార్గదర్శకులుగా నిలవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలో క్రమశిక్షణ నిజాయితీ బాధ్యతాయుత విధి నిర్వహణతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం ఉద్యోగ జీవితంలో అత్యంత గొప్ప విజయమని కలెక్టర్ అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పదవీ విర మణ పొందిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవి తంలోని అనుభవాలను పంచుకుంటూ తమ కు సహ కరించిన జిల్లా యంత్రాంగం సహో ద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా స్థాయి అధికారులు వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు సిబ్బ ంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వరం యంగ్ ఇండియా స్కూల్



- అన్ని వర్గాలకూ ఒకే క్యాంపస్ విద్య ఆలోచన అభినందనీయం
- వచ్చే విద్యాసంవత్సరంలో అందుబాటులోకి యంగ్ ఇండియా స్కూల్
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- స్కూల్ నిర్మాణపనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):** ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్‌గా మారబోతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్ లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్ లో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25.475 ఎకరాల భారీ విస్తీర్ణంలో 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్ జూనియర్ సీనియర్ హాస్టల్ బ్లాకులు డైనింగ్ కిచెన్ లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ సరికొత్త స్కూల్ ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లు కంప్యూటర్ సెంటర్లు సైన్స్ ల్యాబ్‌లు 5000 పైగా పుస్తకాలతో కూడిన డిజిటల్ లైబ్రరీలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల శారీరక మానసిక వికాసం కోసం 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ క్రికెట్ గ్రౌండ్ వాలీబాల్ బాస్కెట్ బాల్ కబడ్డీ కోర్టులను ప్రత్యేకంగా నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా పర్యావరణ హితంగా ఉండేలా సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సౌర పవన విద్యుత్ వ్యవస్థలను నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విధానా లను ఇక్కడ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రవాణాసౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఇప్పటికే రోడ్లు బ్రిడ్జీలు అండర్ బ్రిడ్జీలు ఓవర్ బ్రిడ్జీలు ఔటర్ రింగు రోడ్లు కొన్ని నిర్మాణ దశలో ఉండగా మరికొన్నింటికీ మంజూరు లభించిందని తెలిపారు. అన్ని కులాలవారికి 17 కమ్యూనిటీహాలు మంజూరు చేయడం జరిగిందని ఎయిర్పోర్టు అంతర్జీతీయ క్రికెట్ స్టేడియం క్రీడామైదానాలు జిమ్ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు శక్తివంచ లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈవో వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు హేమచంద్ర రావు, రాజగోపాల్, నాయకులు వాసిరెడ్డి మురళి, యూసుఫ్, ధర్మరాజు, కార్పొరేటర్లు ఎర్రబెల్లి శంకర్, దుర్గ, సుధాకర్, పద్మ, ఆకాంక్ష, హిమశ్రీ, బండి నర్సింహా, విజయ్, తులశమ్మ, సహేరా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):** ప్రజల సమస్యలను సత్వరంగా పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి మౌలిక సదుపాయాలు గృహ నిర్మాణం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ఫలితాలు సాధించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.

**ప్రజావాణిలో అందిన కొన్ని దరఖాస్తులు**

చంద్రుగొండ మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీ ప్రజలు గ్రామపంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం చంద్రుగొండ ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం సీతారాంపేటకు చెందిన యానబోయిన మౌనిక తాను 2017లో డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేశానని కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వ వైద్యశాలలో ఫార్మసిస్ట్ ఉద్యోగం కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు.అశ్వాపురం మండలం కోండికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మొండికుంట గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో 2023లో ప్రారంభించిన డ్రైనేజీ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో తన తండ్రి జక్కం కృష్ణమూర్తి పేరుపై ఉన్న సర్వే నెం.440/20/లోని 4 ఎకరల 27 కుంటల భూమిని వారసత్వంగా తన పేరుపై మార్చి పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని బూర్గంపహాడ్‌కు చెందిన జక్కం శ్యామ్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం బూర్గంపహాడ్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చట్టపల్లి ప్రాంతంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని లింగాల సాయికుమార్ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు.ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులుసిబ్బందిపాల్గొన్నారు.

# బాలల సంరక్షణకై అన్ని డిపార్ట్మెంట్లు సమన్వయంతో పని చేయాలి

- ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(విశాల జ్యోతి):** బాలల సంరక్షణకై అన్ని డిపార్ట్మెంట్లు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. నెల రోజుల పాటు నిర్వహించబడే ఆపరేషన్ ముస్కాన్ -12వ విడత కార్యక్రమంపై జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కాన్ఫరెన్స్ హాల్ నందు అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆపరేషన్ ముష్కన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆపరేషన్ స్మైల్ అండ్ ముస్కాన్ భారతదేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లలను భిక్షాటన చేయుచున్న పిల్లలను నిరాదరణ కలిగిన పిల్లలకు బాల కార్మికులను సంరక్షించే ప్రాథమిక ఉద్దేశాలతో నిర్వహించడం జరుగుతుందని ఈ యొక్క కార్యక్రమం వలన బాధితులైన పిల్లల్ని సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందని వివరించారు. బాలల సంరక్షణ కొరకు ప్రత్యేకంగా పోలీస్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని అంతేగాక హాజరైన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచనలు చేశారు. కొత్తగూడెంజిల్లా పరిధిలో ఎవరైనా 18 సంవత్సరాలలోపు పిల్లల్ని హింసించిన భిక్షాటన చేపించిన పిల్లల్ని బాల కార్మికులుగా మార్చిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందు కొత్తగూడెం డిసిఆర్బి డిఎస్పి మల్లేష్ స్వామి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ లెనినా స్వర్ణలత, డీసీ పీవో హరి కుమారి, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ రాము, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ నాగరాజు, శాస్త్రి, ఏసుపాదం, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డిస్టిక్ కో ఆర్డినేటర్ సైదులు, కేఎస్సిఎఫ్ కో ఆర్డినేటర్ రాజేష్, కమిటీ మెంబెర్స్, ఎస్సైలు రమాదేవి, రాంబాబు, రామ్మూర్తి, రావూఫ్, వెంకన్న, సారంగపాణి, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్ లైన్1098, కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఎన్జీవో, విద్యాశాఖ, వైద్య శాఖ, కార్మిక శాఖకి చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి

- ప్రధానోపాధ్యాయురాలుశారదాదేవి



**తొర్రూరు, విశాలజ్యోతి:** తొర్రూరు పట్టణంలోని హరిపిరాల రోడ్డు కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రధానోపాధ్యాయురాలు ఎం. శారదాదేవి తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించి చెత్త కుండిని ఏర్పాటు చేయాలని,వర్షానికి కూలిపోయిన ప్రహరీ గోడ నిర్మించాలని,వంట గదికి మరమ్మత్తు పనులు చేయించాలనుకోరారు. వాటితో పాటుగా పిల్లలకు రక్షిత త్రాగు నీరు అందేలా మిషన్ భగీరథ నల్లాను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలకు రంగులు వేయించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రమాదేవి, ఉపాధ్యాయులు విమలాదేవి, దర్గా హుస్సేన్ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా గ్రామాన్ని తీర్చిదిద్దుతాం

- పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ గౌడ్




**తొర్రూరు విశాలజ్యోతి:** తొర్రూర్ మండలం వెలికట్ట గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం మహిళా గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బందు శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఆడ మగ అనే పురుష బీద భావం లేకుండా, మహిళలను సామాజికంగా, ఆర్థికంగా చైతన్య పరుస్తూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా స్నేహపూర్వక మహిళ గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. మహిళా సాధికారత, విద్య, ఉపాధి రంగాల్లో మహిళలు సమాన భాగస్వామ్యం వహించినప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరంగల్ మహానగరంలో

## కీలకమైన వ్యవస్థలు నిర్వీర్యం



- ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు

**హనుమకొండ, విశాలజ్యోతి:** వరంగల్ మహానగరంలో మున్సిపల్ కార్పొరేషన్, ఎంజీఎం, కుడా లాంటి కీలకమైన వ్యవస్థలు నిర్వీర్యం కావడం వలన నగరానికి, ప్రజలకి నష్టం జరుగుతుందని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అభిప్రాయపడినారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద నగర కార్పొరేషన్ కి గడిచిన 12 సంవత్సరాలలో పదిమంది కమీషనర్లు మారటం వలన కార్పొరేషన్ పనితీరు అధ్వానంగా మారటమే కాదు కార్పొరేషన్ లో అవినీతి రాజ్యమేలుతుందని అభిప్రాయపడినారు. నగర ప్రజలు కుక్కలు, కోతులు, దోమల బెడదతో సతమతమవుతున్నా కార్పొరేషన్ చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. ఉత్తర తెలంగాణకే తలమానికమైన ఎంజీఎం లాంటి ప్రభుత్వ హాస్పటల్ కి సూపరిండెంట్ లేకపోయినా, పేదలకు వైద్యము, మందులు అందకపోయినా పట్టించుకోరు, డాక్టర్లు విధుల...

# లైసెన్సు కలిగిన మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలి

- ఎక్సైజ్ శాఖసుపరిండేశీట్ ఆర్.లక్ష్మణ్ నాయక్



**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సూఎరిండెంట్ ఆర్. లక్ష్మణ్ నాయక్ జిల్లాలో అక్రమ మద్యం, బెల్ట్ షాపులు, గుడుంబా నిర్మూలనే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. లైసెన్స్ పొందిన మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో గుడుంబా తయారీ, గంజాయి సాగుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని తెలిపారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖను మరింత బలోపేతం చేసి అక్రమమద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని నూతన ఎక్సైజ్ సూఎరింటెండెంట్ ఆర్.లక్ష్మణ్ నాయక్ తెలిపారు. జిల్లాలో బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రత్యేక చర్య లు చేపడతామని, గుడుంబా తయారీ, విక్రయాలపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో గుడుంబా తయారీతో పాటు గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా ఎక్సైజ్ శాఖ పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు కూడా అక్రమ మద్య ం,గుడుంబా,గంజాయి వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారాన్ని ఎక్సైజ్ శాఖకు అందించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇంపాక్ట్ లో ప్రతిభ కనబర్చిన జన్ను రాజమౌళి

- అభినందించిన ప్రముఖులు



**హైదరాబాద్, విశాలజ్యోతి:** పి ఆర్ టి యు తెలంగాణ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి,గూడూరు మండలం,సీతానగరం జాటోతు హెమ్లాతండాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు జన్ను రాజమౌళి ప్రతిష్ఠాత్మకమైన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ఓ ప్రైవేట్ హోటల్ లో నిర్వహించిన “ట్రైన్ దా ట్రైనర్ వర్క్ షాప్ 2.0” ను విజయవంతంగా పూర్తి చేశారు. 30 రోజుల ఆన్లైన్ శిక్షణతో పాటు, సికింద్రాబాద్‌లోని మినర్వా గ్రాండ్ హోటల్లో రెండు రోజుల ఆఫ్లైన్ వర్క్‌షాప్ నిర్వహించగా,ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికెట్‌ను గంపా నాగేశ్వర్ రావు తో పాటు ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ డా. సుధీర్ సాండ్రా చేతుల మీదుగా అందుకున్నారు. ఈ శిక్షణలో ట్రైనర్ లు తమ అనుభవాలను పంచుకుంటూ, నాయకత్వం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్, ట్రైనింగ్ టెక్నిక్స్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై లోతైన శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరియు సమాజానికి ఉపయోగపడేలా కృషి చేస్తానని జన్ను రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా జన్ను రాజమౌళి నీ ప్రముఖులు,ఉపాధ్యాయ సంఘాలు,మిత్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కోచ్‌లు శ్రీనివాస్ సోను,ఉదయ్ భాస్కర్,రామచంద్రుడు, ప్రదీప్,నాగరాజు,పనీంద్రలతో పాటు విద్యావేత్తలు, మనోవిజ్ఞాన నిపుణులు, మోటివేషనల్ స్పీకర్లు, కార్పొరేట్ ట్రైనర్లు తదితరులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారవేత్తలుపాల్గొన్నారు.

# బీసీ కులగణన చేపడతారా గద్దె దిగుతారా

- ఢిల్లీపాలకులు తేల్చుకోవాలి
- బీసీ డిమాండ్ల సాధన కోసం రైతు ఉద్యమతరహాలోఢిల్లీలోని ఎర్రకోటను ముట్టడిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, విశాలజ్యోతి:** జాతి జనగణనలో ఓబీసీ కులగణన చేపడతామని దేశంలోని అరవై కోట్ల మంది ఓబీసీలను నమ్మించి కేంద్రం మోసం చేసిందని, కులగననను చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. జాతి జనగణనలో ఓబీసీ కుటుంబాలను లెక్కించకుండా కేంద్రం బీసీలను నయవంచనకు గురిచేసిందని, బీసీలను వంచించిన కేంద్రానికి తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ సమాజమంతా ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓబీసీలకు దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టకుం డా..బీసీ రిజర్వేషన్లు పెంచకుండా..మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పిం చకుండా, గత 12 సంవత్సరాలుగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రధాని బీసీలకే అన్యాయం చేశాడని ఆయన ఆరోపించారు దేశవ్యాప్తంగా జన్ జీ ఉద్యమ తరహాలో రాజకీయ పార్టీలకతీతంగా ఓబీసీలు ఏకమై ఉద్యమించే సమయం ఆసన్నమైందని తెలిపారు. దేశవ్యాప్తంగా జంతువులకు లెక్కలు తీశారు. కానీ ఓబీసీలకు లెక్కలు తీయకపోవడం మూలంగా స్వాతంత్రం వచ్చిన 80 సంవత్సరాలుగా జనాభా అధికంగా ఉన్న ఓబీసీ లకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతూనే ఉందని, ఈ అన్యాయాన్ని సరిదిద్దడానికి బీసీ లు ఒక్కటిగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి ఉద్యమించుదామన్నారు. బీసీ వ్యతిరేకులకు నేపాల్, బంగ్లాదేశ్ పాలకులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

# నల్లబెల్లి ఊర చెరువులో చేపల దొంగతనం

- దుండగులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.
- మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు, సంఘ సభ్యుల డిమాండ్





**వరంగల్ జిల్లా, విశాలజ్యోతి:** వరంగల్ జిల్లా సంగెం మండలం,నల్లబెల్లి గ్రామ ఊర చెరువు,గత 35 సంవత్సరాల కిందనే సొసైటీ చేయబడింది. ఈ సొసైటీలో 25 కుటుంబాలు చేపల వృత్తిపైన ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ఊర చెరువులో ఈరోజు అనగా సోమవారం నాడు మధ్యాహ్నం సమయంలో జగ్గు నాయక్ తండ కి చెందిన సురేష్, వాగ్య, రాజు, బద్రు ,వీరు కలిసి చెరువు దోపిడీ చేసి మత్స్యకారులకు తీవ్ర నష్టం కలిగించారు. ఇలా వీరు దొంగతనం చేయడం ఇది కొత్తేమీ కాదనీ ,గత ఐదు సంవత్సరాల నుండి వీరు చేపల దొంగతనం చేస్తూనే ఉన్నారు. ఎన్ని సార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసిన ఇదేవిధంగా దొంగతనం చేస్తూ వస్తున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. ఇప్పటికైనా వీరిని శిక్షించి,మత్స్యకారులకు తగిన న్యాయం చేయాలని, ప్రతి సంవత్సరం వీరి వలన తీవ్ర నష్టం జరుగుతుందని నల్లబెల్లి మత్స్య శాఖ సొసైటీ అధ్యక్షులు నీరటి రాజు తో పాటు మత్స్య సహకార సంఘ సభ్యులు అన్నారు. అలాగే మాకు న్యాయం చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారులను, పోలీస్ రక్షణ చట్టాన్ని కోరుతున్నారు.

PRGI No: TGBIL/25/A0946
సమగ్ర తెలుగు దినపత్రిక

# ఎన్టిఈపి ఉద్యోగుల పెండింగ్

- బిల్లులు విడుదల చేయాలి




**ఖమ్మం జిల్లా, విశాలజ్యోతి:** తెలంగాణ వైద్య మరియు ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 1195 జీవోను తక్షణమే అమలు చేయాలని, అలాగే ఎన్ టి ఈ పి గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ట్రావెలింగ్, పి ఓ ఎల్, డేటా బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ, వైద్య, ఆరోగ్య శాఖకు అవసరమైన నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను మరోసారి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య మరియు ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్. సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, ట్రెజరర్ శివ మరియు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి గారిపై రూపొందిన పాట ఆవిష్కరణ




తెలంగాణ రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా, వనపర్తి అభివృద్ధి ప్రదాతగా, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి గారిపై రూపొందించిన "వనపర్తి పొత్తిళ్లలో వేవిండో అడుగిలా ఆకు పచ్చ భూమిగా మార్చినులే వెలుగులా మా గడపలల్లో తొడిగిన తోరణమైనావుగా ఊరు వాడకొచ్చిన పున్నమి వెలుగోలే"... ప్రత్యేక గీతాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అభిమానుల ప్రోత్సాహంతో ,పెద్దమదడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, వనపర్తి మండల్ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్ దర్శకత్వంలో కళాకారుడు చంద్రశేఖర్ ఆజాద్ఈ పాటను రూపొందించారు. ప్రజాసేవకు అంకితభావంతో అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్న డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి ప్రజలకు తమ వంతు సేవలందిస్తూ ప్రజా ఆశీర్వాదం పొందారని ఈ పాటలో ప్రస్తావించారు. "లీడర్లు, కార్యకర్తలే కాదు.. ప్రజలందరే నా కుటుంబం" అనే భావనతో వనపర్తి జిల్లాలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న నాయకుడిగా డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి నిలిచారని పాటలో పేర్కొనబడింది. ఈ గీతం ఆయన ప్రజాసేవా తపనను ప్రతిబింబిస్తోందని వనపర్తి జిల్లా ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. సొంత లాభాలను పక్కన పెట్టి ప్రజా సేవకే ప్రాధాన్యతనిచ్చే నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉండడం వనపర్తి ప్రజల అదృష్టమని పలువురు ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు ఎంట్ల రవి, లోకేష్ అభిమానులు పాల్గొన్నారు.

# మృతదేహాలను బైకుకు తాళ్లతో కట్టి చెరువులో మామ అల్లుడి దారుణ హత్య



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్లోని కృష్ణా జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ద్విచక్రవాహనానికి కట్టేసిన మామఅల్లుళ్ల మృతదేహాలు చెరువులో లభ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్నగొల్లపాలెం చెరువులో సోమవారం ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వీరిద్దరు గత శనివారం కనిపించకుండా పోయినట్టు వారి కుటంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు మొదలు పెట్టారు. ఇంతలోనే రెండు మృతదేహాలు చేరువులో కనిపించిన విషయాన్ని స్థానికులు తెలపడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తుల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అయితే ఇది ఆత్మహత్య, హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భువనగిరి సమరభేరికి మంత్రి పొన్నంను ఆహ్వానించిన టీఆర్పీ నాయకులు

- రాజ్యాధికార సాధనే లక్ష్యం, భువనగిరి సమరభేరికి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజ్యాధికారమే ధ్యేయం..
- ఉచితాలు కాదు, రాజ్యాధికాం సాధనే మా లక్ష్యం...
- టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్, విశాలజ్యోతి:** కరీంనగర్ మాజీ ఎంపీ, హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారిని చుగురుమామిడి మండలం కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి, తీన్మార్ మల్లన్న నాయకత్వంలో జులై 05న భువనగిరిలో నిర్వహించబడే రాజ్యాధికార సమరభేరి మహాసభకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మరియు బహుజన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ అధికారం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉద్యమిస్తోందని తెలిపారు. బీసీల అభివృద్ధి కేవలం సంక్షేమ పథకాలతో కాకుండా, రాజకీయ రాజ్యాధికారం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుకే భువనగిరిలో నిర్వహించనున్న సమరభేరి సభ బహుజన వర్గాల రాజకీయ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక సభగా నిలవనుందని అన్నారు. బీసీలు అంటే ఉచితాలకు వర్తించే వారు కాదని, బీసీలకు వాటా, ఆత్మగౌరవం, అధికారం దక్కేదాక పోరాటం చేస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి, మండల అధ్యక్షులు బుర్ర అశోక్, శివరాత్రి మోహన్, నాయకులు కోరె గంగా, ఉప్పులేటి రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ

## రాష్ట్రవ్యాప్త ఆందోళనకు జేఏసీ పిలుపు




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ఆలోచనకు వ్యతిరేకంగా ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ నాయకులు ఆందోళనకు పిలుపునిచ్చారు. జూలై రెండవ వారం నుంచి నెలాంతరం వరకు దశలవారీగా ఆందోళన నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు వెల్లడించారు. విద్యుత్ బస్సుల పేరిట ప్రైవేట్ ఆపరేటర్లకు అవకావం ఇవ్వడం సరికాదని జేఏసీ కన్వీనర్లు శ్రీనివాసరావు, దామోదరరావు వెల్లడించారు. ఆర్టీసీని పరిరక్షించాలంటూ జులై 7,8 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని, 9 నుంచి 18వ తేదీవరకు ప్రజా ప్రతినిధుల మద్దతు కోరే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 19 నుంచి 26 వరకు ఏపీ సీఎంకు ఉద్యోగుల ఆవేదన తెలియజేస్తూ వినతిపత్రాలపై సంతకాల సేకరణ, 27న ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయాలని అన్ని జిల్లాలు, డిపోల యూనియన్ నాయకులకు సూచించారు. 30న విజయవాడలో జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించి తదుపరి భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకుంటామని జేఏసీ నాయకులు వెల్లడించారు.

# రికార్డు స్థాయిలో తిరుమలను దర్శించుకున్న భక్తులు



**అమరావతి:** తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రికార్డు స్థాయి లో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్క రోజే 91,793 మంది శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ అధికారులు వివరించారు. 31,221 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ .4.90 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. భక్తులు శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడగా వీరికి 18 గంటల్లోసర్వదర్శనం అవుతుందని తెలిపారు 4.38 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించగా 3.31 మంది అన్నప్రసాదం స్వీకరించారని వివరించారు.

# అంగన్వాడీ కేంద్రాల పని వేళల్లో మార్పు




**అమరావతి:** ఎన్నికల సంబంధిత విధుల్లో అంగన్వాడీ టీచర్లు పాల్గొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బూత్ లెవల్ ఆఫీసర్ బాధ్యతలు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లకు వెసులుబాటు కల్పిస్తూ, ఆయా అంగన్వాడీ కేంద్రాల పని వేళలను తాత్కాలికంగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, బీఎల్ఓ విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు ఉన్న కేంద్రాలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే పనిచేయనున్నాయి. ఈ మార్పులు జూన్ 29 నుంచి జూలై 28 వరకు అంటే నెల రోజుల పాటు అమల్లో ఉంటాయి.

# తిరుపతిలో జులై 2న ట్రాఫిక్ డైవర్షన్ ప్రజలకు కీలక సూచన

**తిరుపతి, జూన్ 29:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు తిరుపతిలో జులై 2న పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఓబులవారిపల్లి మండలం మంగంపేటలో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపును అమలు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా పోలీసులు వెల్లడించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ట్రాఫిక్ను సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు జులై 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్లు అమలులో ఉంటాయని పోలీసులు తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి**




తిరుపతిలో సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ డైవర్షన్లను పాటించాలని పోలీసులు సూచించారు. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలన్నారు. ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను తప్పనిసరిగా అనుసరించి సహకరించాలని కోరారు. అత్యవసర సేవల వాహనాలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో ట్రాఫిక్ను సజావుగా నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు. అందరూ పోలీసుశాఖకు సహకరించి అసౌకర్యాన్ని నివారించుకోవాలని తిరుపతి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం, జూన్ 30 2026



# 36 మంది డీఎస్పీల బదిలీ
## ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఇక్బాల్




**హైదరాబాద్:** రాష్ట్రంలో మరోసారి భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. 36 మంది డీఎస్పీలకు స్థానం చలనం కల్పిస్తూ సోమవారం డీజీపీ సీవీ ఆనంద్(జఎ ాాఋఅఎ) ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ జాయింట్ కమిషనర్‌గా కొనసాగుతున్న డి.జోయల్ డేవిస్ ఐదో జోన్, యాదాద్రి డీఐజీగా నియమితులయ్యారు. రామగుండం కమిషనర్ అంబర్ కిశోర్ ఝా జోన్ 1 డీఐజీగా బదిలీ అయ్యారు. వరంగల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సన్‌ప్రీత్ సింగ్ సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా వెళ్లనున్నారు. హైదరాబాద్ ఉత్తర జాయింట్ సీపీ శ్వేతా రెడ్డి వరంగల్ సీపీగా బదిలీ అయ్యారు. సీఐడీ ఎస్పీగా రూపేష్, ఏసీబీ జాయింట్ డెరెక్టర్‌గా చంద్రమోహన్, సాయి మనోహర్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఇక్బాల్, హైడ్రా అదనపు కమిషనర్‌గా ఆనంద్ కుమార్ నియమితులయ్యారు. గోల్కొండ జోన్ డీసీపీగా రాఘవేంద్ర రెడ్డి బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా వై.సాయి శేఖర్ బాధ్యతలు స్వీకరించ ున్నారు. అవినీతి నిరోధక శాఖలో జాయింట్ డైరెక్ట ర్‌గా ఉన్న సీహెచ్.సింధు శర్మ సీఐ సెల్, ఇంటెలిజెన్స్ ఎస్పీగా బదిలీ అయ్యారు.

# టీటీడీ ట్రస్టులకు
## రూ.1.10 కోట్ల విరాళం



**తిరుమల :** హైదరాబాద్‌కు చెందిన లేవేన్ హోల్డింగ్స్ సంస్థ టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ధార్మిక, సేవా ట్రస్టులకు రూ.1.10 కోట్లు విరాళాన్ని అందించింది. సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ వెంకట రవికుమార్ సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి విరాళాల డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.1 కోటి, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ నూతన కమిటీ
## అధ్యక్షుడిగా ఠాకూర్ ఉమ్రావ్ సింగ్




**తాండూర్ :** ఏకగ్రీవంగా ఎనికైన తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ రిక్కల నారాయణరెడ్డి అధ్యక్షుడిగా ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ , కార్యదర్శిగా తాటిపాముల సాంబమూర్తి, కోశాధికారిగా గందె రాజన్న, ఉపాధ్యక్షుడిగా మద్దికుంట రామచందర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ తాండూర్ తెలంగాణ క్లబ్ గత 11 సంవత్సరాలుగా ఉచిత కంటి పరీక్ష, రక్తదాన, మధుమేహ పరీక్ష శిబిరాలను నిర్వహించడమే కాకుండా దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేస్తూ అపన్నులకు నిర్విరామంగా సేవలందిస్తుందని కొనియాడారు. నూతన అధ్యక్షుడు ఉమ్రావ్ సింగ్ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ప్రకారంగా అన్ని కార్యక్రమాలు చేపడతామని అవసరార్థులకు అన్ని విధాల సేవలందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ కోఆర్డినేటర్ దుద్దిల్ల నారాయణ రావు, రీజియన్ చైర్‌పర్సన్ బొమ్మ బాపురెడ్డి, జోనల్ చైర్‌పర్సన్ అన్నం రమేష్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు దేవర కొండ రాజయ్య, బాలప్రసాద్ మారు, మాజీ జోనల్ చైర్ పర్సన్ రౌతు వెంకటేషం, తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ తగ్గించినా భయపడేది
## లేదు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**గద్వాల:** సెక్యూరిటీ తగ్గించి మరో పాలమూరు బిడ్డను ఇబ్బంది పెట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సెక్యూరిటీ తగ్గించినా, గన్‌మెన్లను తొలగించినా, నన్ను చంపేందుకు కుట్ర పన్నినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గద్వాలలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నా గుండుపైన, హరీష్ రావు ఎత్తుపై నా మాట్లాడినట్టు తాను మాట్లాడి సంస్కారహీనుణ్ని కాదలుచుకోలేనని వెల్లడించారు.
నడిగడ్డ సస్యశ్యామలం కావాలని కేసీఆర్‌గట్టు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే పట్టించుకోవడం లేదని, ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లేదని విమర్శి ంచారు. పెండింగ్ పనుల విషయంలో పార్టీ మారిన ఎమ్మెల్యే గద్వాల నియోజకవ ర్గానికి ఎన్నికోట్లు తీసుకొచ్చాడో ప్రజలకు తెలియ జేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో జరిగిన సమావేశంలో తెలంగాణ నీటిపా రుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని బయటపెట్టి ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి నలుగురు కర్ణాటకలో ఏమి మాట్లాడారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నడిగడ్డలోని నెట్టెంపాడు ర్యాలంపాడు తుమ్మిళ్ల పనులు పూర్తి చేయకుండా పనులు పడావు పెట్టారని విమర్శించారు. దమ్ముంటే నడిగడ్డలో వున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి తెల ంగాణ ప్రయోజనాలను ఆంధ్ర వాళ్లకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఎంపీ మల్లురవి ఢిల్లీకి మూటలు మోయడం తప్పా నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు లేదన్నారు.

# ప్రజలకు పోలీసు అధికారులు పారదర్శకంగా
## సేవలందించాలి జిల్లా ఎస్పీ వినీత్




**ఊట్కూర్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి భేదభావం లేకుండా పారదర్శకంగా , మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ స్టేషన్‌ను సందర్శించారు. పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ వ్యవస్థ, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రౌడీ, సస్పెక్ట్, కమ్యూనల్ షీటర్లపై నిరంతర నిఘా ఉంచి నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, అక్రమ వ్యాపారాల అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్‌లాల్, ఎస్ఐ రమేష్, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త తరహాలో బ్రాండ్ ప్రచారం
## మల్టీవర్స్ కమ్యూనికేషన్ ఏజెన్సీ ప్రారంభం

**హైదరాబాద్:** అడ్వర్టైయిజింగ్, పబ్లిక్ రిలేషన్స్, డిజిటెల్ మార్కెటింగ్, కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్మెంట్‌కు చెందిన కొత్త ఏజెన్సీ మల్టీవర్స్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. మాజీ జర్నలిస్టు విజయ్ అమృత్‌రాజ్ ఈ ఏజెన్సీని నెలకొల్పారు. వివిధ బ్రాండ్లకు విశ్వసనీయమైన ప్రమోషన్ ఏర్పాటు చేసే లక్ష్యంతో దీన్ని ప్రారంభించారు. పీఆర్‌లో విశేష అనుభవం ఉన్న ఆయన.. ఈ సంస్థను త్వరలో దేశంలోని వివిధ నగరాల్లో విస్తరించనున్నారు. గతంలో బయోలాజికల్-ఈ, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థల్లో ఆయన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్‌గా పనిచేశారు. ప్రఖ్యాత పబ్లిక్ రిలేషన్స్ ఏజెన్సీ రిడిఫ్యూజన్‌లోనూ ఆయనకు పనిచేసిన అనుభవం ఉన్నది. ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌లోనూ ఆయన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ వ్యవహారాలు చూశారు. ప్రకటనల్లో భాగంగా సంప్రదాయ మరియు డిజిటల్ మాధ్యమాల్లోవ్యూహాత్మక బ్రాండ్ ప్రచారం, ప్రజాసంబంధాల్లో భాగంగా ప్రతిష్ఠ నిర్వహణ, మీడియాసంబంధాలు, సంక్షోభ కమ్యూనికేషన్, విధాన పరిరక్షణ ఈ ఏజెన్సీ చేపట్టనున్నది. డిజిటల్ మార్కెటింగ్‌లో సోషల్ మీడియా నిర్వహణ, కంటెంట్ మార్కెటింగ్, ూజుూ, ఆన్‌లైన్, చెల్లింపు ఆధారిత డిజిటల్ ప్రచారాలు నిర్వహించనున్నారు. ఇక కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఉత్పత్తుల ఆవిష్కరణలు, సంస్థాగత కార్యక్రమాలు, ప్రభుత్వ అనుబంధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మల్టీవర్స్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ అమృత్‌రాజ్ మాట్లాడు తూ.. హైదరాబాద్‌లోమల్టీవర్స్ప్రారంభించడం ఎంతో ఆనందంగాఉందని, చాలా సంస్థలు తమ బ్రాండ్ల గుర్తింపును పీఆర్, డిజిటల్, ప్రకటనలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వేర్వేరు ఏజెన్సీల మధ్య విభజించుకోవాల్సివస్తోందని, ఆ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతోనే మల్టీవర్స్‌ను స్థాపించానన్నారు. క్లయింట్-సైడ్‌అనుభవం, కార్పొరేట్ వ్యవహారాల నైపుణ్యం, దీర్ఘకాలిక బ్రాండ్ నిర్మాణంలో విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తామన్నారు.

# అర్ధరాత్రి బాలికల హాస్టల్ భవనం పైనుంచి
## దూకిన ఇంటర్ విద్యార్థిని తీవ్ర గాయాలు



**హైదరాబాద్ :** అర్ధరాత్రి గిరిజన బాలికల హాస్టల్ భవనం పైనుంచి దూకడంతో ఇంటర్ విద్యార్థిని గాయపడింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగుర్తి గ్రామంలో చోటు చేసుకుది. ఈ ప్రమాదంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మహేశ్వరి అనే విద్యార్థినికి తీవ్ర గాయమైంది. తొలుత స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా దవాఖానకు తరలించగా.. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. విద్యార్థిని భవనం పై నుంచి ఎందుకు దూకింది అనే విషయంపై అధికారులు విచారణ చేపట్టారు.

# మైనంపల్లి హన్మంతరావు అనుచరుడిపై పోక్సో కేసు



**హైదరాబాద్ :** కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంత రావు అనుచరుడు రవి కుమాం అలియాస్ రఫీపై పోక్సో కేసు నమోదైంది. అల్వాల్‌లో జిమ్‌లో పరిచ యమైన యువతిని ట్రాప్ చేసిన రవి.. బాధిత మహిళతో పాటు మైనరైన ఆమె కూతురిని కూడా వేధించడంతో అతడిపై పోక్సో కేసు పెట్టారు. ఏ1గా రవి, అతడికి సహాయం చేసిన సోదరుడు ఏ2 రూపేష్‌పై పోక్సో కేసు రిజిష్టరైంది. మైనంపల్లి హన్మంతరావు అనుచరుడైన రవి కుమార్ అలియాస్ రఫీ గతంలోనూ అమ్మాయిలను మోసం చేశాడు. ప్రేమ పేరుతో ముగ్గురు యువతులను పెళ్లి చేసుకొని, వారి ప్రైవేట్ వీడియోలు తీసి డబ్బుల ఇవ్వాలని బెదిరించినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. నిత్య పెళ్లి కొడుడైన రవికి ఇటీవల అల్వాల్ జిమ్‌లో పరిచయమైన యువతిని ట్రాప్ చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని వేధింపులకు గురి చేశాడు. దాంతో, సదరు యువతి ఫిర్యాదుతో రవిపై పోక్సో కేసు పెట్టారు.

# రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ
## ఏసీబీకి చిక్కిన ఏఈ



**కొత్తగూడెం:** నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న లట్టుబుక్త శ్రీనివాస రావు అవినీతి నిరోధక(ూజదీ) అధికారులకు దొరికాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట సబ్ డివిజన్-1 నీటిపారుదల శాఖలో ఏఈగా ఉన్న శ్రీనివాస రావు సోమవారం రైతు నుంచి రూ.2లక్షల లంచం తీసుకుంటూ పట్టుపడ్డాడు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు అతడిని ఏసీబీ బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. తమ వ్యవసాయ భూమి పక్కనే ఉన్న దొంతికుంట ట్యాంక్ నుంచి మట్టి తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని బాధితుడు ఏఈ శ్రీనివాసరావును కోరాడు. అందుకు అతడు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దాంతో, సదరు వ్యక్తి అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో మాటు వేసిన ఏసీబీ అధికారులు సోమవారం శ్రీనివాసరావు రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి వరంగల్ జడ్జి ముందు హాజరు పరిచారు.

# మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి
## ఎస్ఎల్‌బీసీపై మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్




**హైదరాబాద్ :** మా కాంగ్రెస్ హయాంలో 34 కిలోమీటర్లు పూర్తి చేసినం. మీకు 10 కిలోమీటర్లు మిగిలి ఉండే పూర్తి చేయలేదు. నేను ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి 3 లక్షల 60 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి అబద్దాలు మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. ఈ విషయమై తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అదే ఉపన్యాసంలో చివరన వచ్చే ఎన్నికల కంటే ముందే ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి నీళ్లిస్తా అని అంటున్నడు. ఒక్క ఉపన్యాసంలోనే మొదటికీ, చివరికీ.. అంటే సీఎం రేవంత్ రెడ్డి మెదడుకు, పెదాలకు సంబంధం లేకుండా మాట్లాడుతున్నడని ఎద్దేవా చేశారు రేవంత్ రెడ్డి ఏం మాట్లాడుతున్నడో మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నడని కర్నె ప్రభాకర్ ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో ఎక్కడికి పోయినా కానీ కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు తిరిగి కోరుకుంటున్నరు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకో అంటున్నరు . అన్నా ఎప్పుడొస్తవ్ కేసీఆర్ మాకు అండగా నువ్వే అని చెప్పి రైతాంగం ఎదురుచూస్తోంది. ఆ విషయం అర్థమై ఈ మధ్య వస్తున్నటువంటి అనేక సర్వేల్లో మైండ్ బ్లాంక్ అయి మెదడు దొబ్బి మొదటి ప్రసంగంలోనేమో ఎస్ఎల్‌బీసీ పూర్తయిందట.. ఆయన నీళ్లిస్తున్నడట అని కర్నె ప్రభాకర్ అన్నారు.